

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ శుక్రవారం పారాయణ ప్రారంభం ★

# శ్రీ సాయి లీలామృతము



## అధ్యాయము - 5

## సర్వజ్ఞుడు

శ్రీసాయి పిచ్చి ఫకీరులా కన్పించినా, వారి దివ్య లీలలెన్నో ఆకాశంలో నక్షత్రాలలా, సముద్ర తీరాన యిసుక రేణువులలా, మనస్సులో పుట్టే ఆలోచనలలా భక్తులకనుక్షణమూ అనుభవమవుతూ, వారి హృదయాలను పులకింప జేస్తుండేవి. అవి ఆయన ప్రయత్నంతో ప్రదర్శించినవి గాక పువ్వులకు పరిమళంలాగా, ఆకాశంలోని సంధ్యారాగంలా ఎంతో సహజంగానూ, సందర్భోచితంగానూ వుండేవి. వజ్రాల హారంలోని బంగారు తీగలా, పూలమాలలోని దారంలా యీ లీలలన్నింటిలో శ్రీసాయినాథుని సర్వజ్ఞత్వం అడుగడుగునా తొంగిచూస్తూ వుంటుంది. దానిని గుర్తించు కోగలవారు ఎవరినీ ఏమీ అడగనక్కరలేదు.

సాయిబాబా ఒకరోజు నాగపూర్‌లో వున్న మహనీయుడు తాజుద్దీన్‌బాబా గురించి మాట్లాడుతూ, సట్కాతో ప్రక్కనున్న నీటికుండను పదే పదే తట్టారు. కారణం అడిగితే 'తాజుద్దీన్ కుటీరం అంటుకుంటే ఆర్పుతున్నాను' అన్నారు. తర్వాత అది యదార్థమని తెలిసింది. మరొకరోజు లెండీకి వెళ్ళే సమయమైనా బాబా మసీదులో గోడ ప్రక్కనే నేలమీద పడుకున్నారు. కారణమడిగితే, 'నా సోదరుడు గజానన్ మహరాజ్ (షేగాం) పరమపదించారు' అన్నారు. త్వరలోనే అది నిజమని తెలిసింది. నాటి శృంగేరి శంకరాచార్యస్వామిచేత సాక్షాత్తూ దత్తాత్రేయ స్వరూపమని కీర్తించబడిన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి రాజమండ్రిలో విడిది చేశారు. నాందేడ్ నుండి 'పుండలీకరావు' (దాసగణు) వారిని దర్శించాక తాను శ్రీ సాయిని గూడ దర్శిస్తుంటానని చెప్పాడు. ఆ స్వామి ఎంతో సంతోషించి, "సన్యాసులమైన మేము ఎవరికీ నమస్కరించము. కాని శ్రీ సాయి విషయం వేరు. ఈ కొబ్బరికాయ మా తరపున వారికి సమర్పించు. ఈ తమ్ముణ్ణి ఎప్పుడూ ప్రేమగా గుర్తుంచుకొమ్మని చెప్పు!" అని అతడికి ఒక కొబ్బరికాయ యిచ్చారు. తర్వాత అతడు, అతని మిత్రులూ మన్మాడ్‌లో దిగి, సమీపంలోని ఏటిదగ్గర కారపు అటుకులు తింటూ, పొరపాటున ఆ కొబ్బరికాయ కొట్టి, అందులో కలుపుకొని తిన్నారు. వాళ్ళందరూ శిరిడీ చేరగానే సాయి అతనిని చూస్తూనే, "నా సోదరుడు పంపిన కొబ్బరికాయ ఏది?" అన్నారు. అతడు తాను చేసిన తప్పు చెప్పుకొని, క్షమాపణ వేడుకొని, దానికి బదులు మరొక కాయ సమర్పిస్తానన్నాడు. బాబా, "నా సోదరుడిచ్చిన కాయకు మరేదీ సాటి కాజాలదు. అయినా జరిగినదానికి బాధపడకు, అంతటికీ భగవంతుడే కర్త!" అన్నారు. కన్నడ దేశంలోని వాడ్గాంలో విడిది చేసిన అప్పా అనే మహాత్ముని గురించి, బెంగాల్‌లోని శ్రీ రామకృష్ణ పరమహంస గురించి, పూనాలోని హజరత్ బాబాజాన్ గురించి - యిలా యింకెందరి గురించో సర్వమూ వారికి తెలుసు. పూనాలోని భీమశంకర ఆలయంలో వున్న ఒక సాధువును గాడ్గిల్ దర్శిస్తుండేవాడు. ఆయన ఒకసారి అతనిని శ్రీ సాయి దర్శనానికి పంపారు. అతడు శిరిడీ చేరి, "ఇక్కడ ఏ మహాత్ముడైనా వున్నారా?" అని విచారిస్తే, "ఇక్కడి మశీదులో ఒక పిచ్చి ఫకీరు మాత్రమున్నాడు" అని చెప్పారు. శ్రీ సాయి ముస్లిమని సంశయిస్తూనే గాడ్గిల్ మశీదు చేరాడు. అప్పుడు బాబా, "నీవీ మశీదులోకి రావద్దు. నేను ముస్లిమును, నీవు ఆ భీమశంకరాలయంలోని సాధువు కాళ్ళమీదే పడు!" అని కేకలేసారు. అలానే ఆయన ఒకరోజున పండ్లు, మిఠాయిలు కొని అందరికీ పంచారు. కారణమడిగితే, "ఈరోజు ఒక మహాత్ముని దర్బారునుండి ఒకడు యిక్కడకు వచ్చాడు" అన్నారు. విచారిస్తే అచ్చటివారిలో హుబ్లీలోని

శ్రీ గురు సిద్ధారూఢుల శిష్యులొకరు వున్నారని తెలిసింది.

ఇంతటి మహనీయులందరి గురించి అనుక్షణమూ తెలుసుకొనగల సాయికి సామాన్యులైన సాధువుల గురించి గూడ తెలుసు. ఆయన మహిమ విని 1911లో హరిద్వార్ నుండి సోమదేవస్వామియనే సాధువు శిరిడీ బయల్దేరాడు. అతడెక్కిన టాంగా శిరిడీని సమీపిస్తుండగా అచ్చటి మశీదుపై కట్టిన జెండాలు దూరం నుండి చూచి, "ఈయన నిజమైన సాధువైతే తన కీర్తిని యిలా చాటుకోడు. ఇలాంటి వాణ్ణి చూడనైనా కూడదు" అన్నాడు. కాని సాటివారి బలవంతంపై సాయిని దర్శించగానే అతడి హృదయం శాంతిని పొంది ఆనందభాష్పాలు కారాయి. అలా చిత్తశాంతినివ్వగలదే యోగ్యమైన స్థలమని తన గురువు చెప్పిన వాక్యం అతనికి గుర్తొచ్చింది. కాని సాయి కోపంతో, "జెండాలు ప్రదర్శించుకునే యీ కపట సాధువును చూడనైనా కూడదు. తిరిగి నీ స్వస్థానానికి వెళ్ళిపో! ఈ మశీదులోకి వచ్చావో జాగ్రత్త!" అని గద్దించారు. అతడు ఆయన సర్వజ్ఞత్వం చూచి, పశ్చాత్తాపంతో శరణు వేడాడు. అప్పుడతనిని మశీదులో ప్రవేశించనిచ్చారు బాబా.

భక్తుడు రేగే 1914లో మిత్రుడు అవస్తేను ప్రోత్సహించి శిరిడీ తీసుకెళ్ళాడు. దారిలో ఒక స్టేషన్లో సైనికాధికారి రైల్లోని ప్రయాణీకులను దింపి సైనికులను ఎక్కిస్తున్నాడు. కాని చిత్రంగా అతను వీరిద్దరినీ తిరిగి రైలెక్కించాడు. రేగే రాత్రంతా భజన చేశాడు. వారు శిరిడీ చేరగానే రేగేను చూపుతూ సాయి, "అతడికి ఎవరినైనా వెంట తీసుకొస్తేగాని తృప్తిలేదు. వాళ్ళు నా బిడ్డలను రైల్లోంచి దింపేయాలని చూచారు. కాని వీళ్ళిద్దర్నీ దింపవద్దని ఆ సైన్యాధికారితో చెప్పాను" అన్నారు. రేగేను చూపుతూ, "నాకు రాత్రంతా నిద్రలేదు. నా పడకచుట్టూ 'బాబా' 'బాబా' అన్న యితడి కేకలే!" అన్నారు.

మనం చేసేది ఎవరికి తెలియకున్నా మనకు తెలుస్తుంది. అలా మనలో అన్నీ తెలుసుకొనేది సాయియే. ఒకసారి శ్రీమతి కణీత్కర్ ద్రాక్షపండ్లు సమర్పిస్తే బాబా ఎంతో ప్రీతితో తీసుకున్నారు. కాని వెంటనే అందులోంచి కుళ్ళిన పండ్లు మాత్రమే తీసుకొని మిగిలినవి తిరిగి యిచ్చి, "ఇవి నీ బిడ్డలకిచ్చుకో!" అన్నారు. ఆమె బాధపడుతూ యిల్లు చేరాక వాళ్ళ అమ్మాయి, 'అమ్మా! నీవా పండ్లు బాబాకివ్వగానే, 'అయ్యో! బాబా ఆ పండ్లన్నీ అందరికీ పంచేస్తారు. ఆయన తిన్నట్లు గాదు, మనం తిన్నట్లూ గాదు' అనుకున్నాను!" అన్నది. ఆమె భావం కన్నతల్లికి తెలియకున్నా సాయికి తెలుసు! ఒకసారి గాడ్గిల్ మామిడి పండ్లు సమర్పిస్తే తీసుకొని, "ఆహా! ఇతడు కొన్న పండ్లన్నీ నాకే సమర్పించాడు. కాని పండిట్ నా కోసం కొన్న పండ్లలో కొన్ని తిని, మిగిలినవిచ్చాడు!" అన్నారు. పండిట్ సిగ్గుతో తలవంచుకున్నాడు.

చోల్కర్ అనే పేదగుమాస్తా, తాను పరీక్షలో పాసై ఉద్యోగమొస్తే శిరిడీ వచ్చి కలకండ పంచుతానని మ్రొక్కుకున్నాడు. అతని కోరిక నెరవేరింది. అతడు నిత్యమూ 'టీ' లో చక్కెర వేసుకోవటం మానివేసి, అలా కూడబెట్టిన పైకంతో శిరిడీ చేరి, కలకండ పంచాడు. తర్వాత జోగ్‌తో, "ఇతనిని తీసుకెళ్ళి, చక్కెరెక్కువ వేసిన 'టీ' యివ్వు" అన్నారు బాబా. దాసగణుకెంతో ఆచారం. అతడు ఉల్లి తినేవాడు గాదు. ఒకసారి బాబా అతనిని ఉల్లిపాయ, శెనగపప్పు కలిపి ('పితలా') వండి, కొంచెం తిని, తర్వాత తమకు తెమ్మన్నారు. అతడది తేగానే, నీవు తిన్నావా?" అన్నారు. అతడు తిన్నానన్నాడేగాని నిజానికి అతడు అందుకు ప్రత్యామ్నాయంగా దానిని వేలుతో తాకి పెదవికి, గడ్డానికీ అనించుకొని ముఖం కడుక్కున్నాడు. బాబా నవ్వి, అతడు చేసినది చేసి చూపారు. ఉల్లి అతనికి ఎంతో మేలు చేస్తుందని, తినమనీ చెప్పారు. ఒకసారి దీక్షిత్ మశీదుకు రాగానే బాబా, "నీవు తాంబూల మివ్వలేదు" అని అడిగి తీసుకున్నారు. గదిలో తాను పూజ చేసినప్పుడు తాంబూలం అర్పించడం మరచానని అతనికి అప్పుడు గుర్తొచ్చింది.

భిక్కుబాయి తెచ్చిన పూలమాల, నివేదన బాబా స్వీకరించలేదు. అవి స్వీకరించమని బ్రతిమాలిన భక్తులతో ఆయన, "ఈమె గోదావరివద్ద శోకంతో నన్ను నిందించింది. అలా తెచ్చినవి నాకొద్దు!" అన్నారు. ఆమె పట్టంగా మాల వేయబోతే, అది మూడు ముక్కలై క్రింద పడింది! నిజమే! సాయి తన స్నేహితురాలైన రాధాకృష్ణ ఆయి ప్రాణం కాపాడలేదని ఆమె కోపర్గాంలోని గోదావరి వద్ద సాయిని నిందించి, శోకించి, తర్వాత ఆ మాల నివేదన తీసుకొని శిరిడీ వచ్చింది. అలానే ఒక లాయరు వచ్చి నమస్కరించగానే సాయి, "కొందరెంత దొంగలో! పాదాలమీద పడి దక్షిణ సమర్పిస్తారు. వీపు వెనుక వాళ్ళే విమర్శిస్తారు" అన్నారు. పండరిపురంలో ఒక పెద్దమనిషి తన జబ్బు తగ్గించమని సాయినాశ్రయించటం మూఢ నమ్మకమని విమర్శించాడా లాయరు.

సదాశివ్‌కు ఉదయం 9 గంటలకే భోజనం చేయడం అలవాటు. కనుక ఆ రోజు 11 గంటలు కావటంతో అతనికెంతో ఆకలిగా వుంది. కాని అతడు బిడియంతో మశీదులోనే కూర్చుండిపోయాడు. ఇంతలో ఒక భక్తుడొచ్చి బాబాకు పాలకోవా సమర్పించాడు. సాయి దానిని ఆత్రంగా అందుకొని సదాశివ్‌కు ఒక బిళ్ళ విసిరారు. అతడు దానిని ప్రసాదంగా యింటికి తీసుకెళ్ళాలనుకున్నాడు. "అది నీకిచ్చింది చేతిలో పట్టుకోవడానికి గాదు!" అన్నారు బాబా. అది తిన్నాక అతనికి మరో బిళ్ళ విసిరారు. అతడది యింటికి ప్రసాదంగా వుంచుకోగానే మరల సాయి అలానే అన్నారు. అదికూడా తినగానే అతనికి ఆకలి తీరింది.

ఒకసారి హరిభావూ తన తల్లికి చెప్పకుండా రామేశ్వరం బయలుదేరి, దారిలో శిరిడీ వచ్చాడు. సాయి అతని వద్దనున్న డబ్బంతా దక్షిణగా తీసుకొని, 'ఇంటికి వెళ్ళు, రామేశ్వరం నీ కోసం వస్తుంది. నీవు వెళ్ళకుంటే మరణిస్తుంది' అన్నారు. అతడిల్లు చేరేసరికి అతని తల్లి నిరాహారియై, 'బాబా, నీవు మహాత్ముడివైతే నా బిడ్డ తిరిగి రావాలి' అని రోజూ ప్రార్థిస్తున్నదని తెలిసింది. తల్లి రామేశ్వరమంత పవిత్రమైనదని బాబా భావం.

సాఠే శిరిడీలో తానుకొన్న స్థలం చూడ్డానికి తన భార్యను బయలుదేరమన్నాడు. ఇంతలో అతని మామగారు, ఆడపిల్ల స్థలం చూచేదేమిటని అడ్డు చెప్పడంతో ఆమె రానన్నది. తన మాట కాదన్నదన్న కోపంతో ఆమెను కొట్టడానికి కొరడా తీసుకున్నాడు సాఠే. ఆ క్షణమే అతనిని మశీదుకు రమ్మనమని బాబా కబురు పంపారు. అతడు వెళ్ళగానే ఆయన, "ఏమిటి నీ గోల? అమ్మాయి స్థలం చూడకపోతేనేమి?" అని మందలించారు. తన యింట జరిగే ప్రతిదీ ఆయనకు తెలుస్తుందని సాఠే గుర్తించాడు. అలానే ఒకసారి శ్రీమతి ప్రధాన్ ఆయనకు పాదపూజ చేస్తుండగా, "నీవు వెంటనే యింటికెళ్ళు" అన్నారు బాబా. ఆమె వెళ్ళేసరికి పాప గుక్కపెట్టి ఏడుస్తున్నది. ఆమె పాపను సముదాయించి మరలా మశీదుకు వెళ్ళింది. "ఇప్పుడు పూజ పూర్తి చేసుకో!" అన్నారు సాయి.

నూల్కర్ మొదటిసారి శిరిడీ వెళుతూ దక్షిణగా రూ. 20/-లు బాబాకు సమర్పించాలనుకున్నాడు. సాయిని దర్శించి, ఆయన కళ్ళలోకి చూస్తూనే, అంతటి మహాత్ముణ్ణి దర్శించుకోగలగడం మహాభాగ్యమనుకున్నాడు. బాబా వెంటనే దక్షిణ కోరారు. అతడొక బంగారు నాణెమిచ్చాడు. సాయి దానిని త్రిప్పిచూస్తూ, "దీని విలువెంత?" అన్నారు. "పదిహేను రూపాయలు" అన్నాడు నూల్కర్. సాయి దానిని తిరిగిచ్చి, 'ఇది నీవుంచుకొని రూపాయలివ్వు!' అన్నారు. అతనిచ్చిన రూ. 15/-లు తీసుకొని, "నాకు. రూ. 10/-లే ముట్టాయి. ఇంకా రూ. 5/-లు యివ్వు" అన్నారు. అతడిచ్చాడు. ఆ విధంగా అతడివ్వదలచిన రూ. 20/-లే తీసుకున్నారు బాబా. అలానే శ్రీమతి బాపత్ నాలుగణాలు యిచ్చినప్పుడు ఆయన నవ్వుతూ, 'మిగిలిన నాలుగణాలివ్వక యీ పేద బ్రాహ్మణ్ణెందుకు మోసగిస్తావు?' అన్నారు. ఆమె సిగ్గుపడి మరో నాలుగణాలిచ్చింది. కారణం మొదట ఆమె ఎనిమిది అణాలివ్వదలచిందట!

ఒక భక్తుడు బాబాకు దక్షిణగా శ్యామా పేరిట రూ. 2/-లు మనియార్డర్ పంపాడు. అది చేరినప్పుడు

బాబా భిక్షకు వెళ్ళారు. ఆయన సర్వజ్ఞతను పరీక్షించదలచి, శ్యామా ఆ కాసులు మశీదు ముంగిట పాతిపెట్టాడు. ఆయన వాటి విషయమై ఏమీ అనలేదు. ఆరుమాసాల తర్వాత శ్యామా యింట దొంగలుపడి సర్వం దోచుకు పోయారు. అతడు బాబాతో మొరపెట్టుకొంటే ఆయన నవ్వుతూ, "నీ యింట దొంగలు పడితే చెప్పుకోడానికి నేనైనా వున్నాను. నావి రూ. 2/-లు పోయి 6 మాసాలైంది. నేనెవరికి చెప్పుకోను!" అన్నారు. "అంత చిన్న తప్పుకు యింత పెద్ద శిక్షా?" అన్నాడు శ్యామా. "నీలాంటి ఉద్యోగికి అదెంతో, నాలాటి ఫకీరుకు రూ. 2/-లు అంతే" అన్నారు సాయి. కర్మసూత్రమెంత సూక్ష్మమో!

అందరినీ దక్షిణడిగిన బాబా కొలంబేను మాత్రం అడగలేదు. తాను త్రాగుడు మానినందుకు సాయి తననలా గౌరవించారని అతడు గొప్పలు చెబుతున్నాడు. సాయి వెంటనే అతనిని పిలిపించి, రూ. 2/-లు అడిగి తీసుకొన్నారు! గర్వము గూడా దోషమే! మరొక భక్తుడు సాయి దక్షిణకోరితే లేదని చెప్పవచ్చని, తన దగ్గరున్న డబ్బు కొలంబే వద్ద దాచాడు. వారిద్దరూ మశీదుకు చేరగానే సాయి అతడికి కొలంబేను చూపి, "అతనివద్ద తీసుకొని రూ. 2/-లు దక్షిణివ్వు" అని చెప్పి తీసుకొన్నారు.

దాసగణు శిరిడీ వెడుతుంటే కోపర్గాఁవ్‌లో స్టేషన్ మాష్టర్, సాయిని పిచ్చి ఫకీరని నిందించాడు. బాబాను స్వయంగా చూచి మాట్లాడమని చెప్పి, దాసగణు అతనిని శిరిడీ తీసుకొచ్చాడు. సాయి మశీదులోని కుండలన్నీ బోర్లిస్తున్నారు. కారణమడిగిన స్టేషన్ మాష్టర్‌తో,"నా దగ్గరకు వచ్చే కుండలన్నీ తలక్రిందులుగానే వస్తున్నాయి" అన్నారు. అంధమైన అవిశ్వాసంతో వచ్చేవారి హృదయాలు బోర్లించిన కుండలు, వాటిని జ్ఞానంతో నింపడం సాధ్యంగాదు. విశ్వాసంతో గాని, లేక కనీసం జిజ్ఞాసతోగాని వచ్చేవారి హృదయాలు సరియైన కుండలు, వాటిని నింపవచ్చు. కాని చిత్రం, ఆ మాటతో సాయి అతని హృదయమనే కుండను సరిజేశారు, విశ్వాసంతో నింపారు.

ఒకడు సాయి నిష్కారణంగా కోపించడం చూచి ఆయన పిచ్చివాడని తలచి, తానిచ్చిన దక్షిణంతా తిరిగి తీసుకోవాలనుకున్నాడు. కాని బాబా అతడడుగక ముందే అతని భార్యకు పైకమిచ్చి, "ఇంతవరకూ మీరిచ్చిన దక్షిణ నాకొద్దు, తీసుకో!" అన్నారు.

ఇంతవరకూ ఎక్కడెక్కడో వున్న మానవుల యొక్క పరిస్థితులు హృదయగతభావాలు బాబాకు అనుక్షణమూ తెరచి వున్న పుటలలాగా ఎలా తెలుస్తుండేవో గమనించాము. ఎక్కడెక్కడ ఏ భక్తులు ఆపదలో వున్నారో వారికేమి జరుగనున్నదో ఆయనకు తెలుసు. వాళ్ళకు శ్రేయస్కరమైతే, అట్టి ఆపదను నివారిస్తుండేవారు. ఎప్పుడైనా బాబా తమ చేతులు శంఖంలా కలిపి వూదితే అది ఏభక్తుని మరణమో సూచించేది. ఒకరోజు ఆయన అలా చేసి, "నానా చావనున్నాడు. కాని నేను చావనిస్తానా?" అన్నారు. నాటికి 8వ రోజున నానా చందోర్కర్ శిరిడీ వచ్చాడు. సరిగా బాబా అలా అన్నప్పుడే తానెక్కిన గుఱ్ఱపు బండి తలక్రిందులై, అతడు గుఱ్ఱం కాళ్ళవద్ద పడ్డాడు. అయినా అతనికెట్టి ప్రమాదమూ జరుగలేదని చెప్పాడు. ఒకసారి ఆయన తమకు కడుపు నొప్పిగా వున్నదని చెప్పి, ఒక గుడ్డ పొట్టకు చుట్టుకొని, భక్తులను కొసలు పట్టుకొని యింకా యింకా గట్టిగా లాగమని చెప్పి, చివరికి బాధ తగ్గిందన్నారు. అదే సమయంలో నీమ్‌గాఁవ్‌లో ఒక భక్తురాలు ప్రసవవేదనపడి, ఆయన నొప్పి తగ్గినదన్న సమయంలోనే ప్రసవించిందని తర్వాత తెలిసింది. భక్తుల బాధలు గూడ ఆయనవే. ఒకరోజు ఆయన ప్రధాన్‌తో, "నా శరీరంలోని యీ ప్రక్కంతా నొప్పిగా వుంది. నాల్గురోజులలో తగ్గుతుందిలే!" అన్నారు. వారం తర్వాతగాని అతనిని యింటికి పోనివ్వలేదు. అతడు యిల్లుచేరాక తెలిసింది - సరిగ్గా బాబా అలా అన్న సమయంలోనే బొంబాయిలో అతని తల్లికి పక్షవాతం వచ్చింది. ప్రధాన్ శిరిడీలో వున్నంతవరకూ ఆమెకెట్టి ప్రమాదమూ జరుగదని, అవసరమైతే అతనిని సాయియే పంపగలరనీ నానా చందోర్కర్ ఆ యింటివారికి ధైర్యం చెప్పాడు. ఆ వారంలో ఆమె పరిస్థితి విషమించింది.

ఆమెకు విరోచనమైతే మంచిదని వైద్యులన్నారు. సరిగ్గా సమయానికి ప్రధాన్ యిల్లు చేరి, ఆమెకు తీర్థప్రసాదాలివ్వగానే నాల్గవరోజున జబ్బు తగ్గింది. అలానే సాయి ఒకనాడు మహల్సాపతితో, "నీ భార్య మెడవాచి బాధపడుతున్నది. నేనే తగ్గిస్తాను. ఇతరులవల్ల గాదు" అన్నారు. మరో ఊళ్ళోవున్న ఆమె అలా బాధపడిందని, తర్వాత ఆ బాధ తగ్గిపోయిందనీ కబురు వచ్చింది.

ఎప్పుడైనా ఆయన, భక్తులకు యిలాంటి బాధలు తొలగించకుంటే అందుకు బలీయమైన కారణం ఏదో వుండేది. మోహిలే అను భక్తుడు తన కుమార్తెను శిరిడీ తీసుకొచ్చాడు. ఆ పాపకు పై పెదవి చీలివున్నది. సాయి, "నేను యీ బిడ్డను బాగుచేయగలను, కాని దేవకోటికి చెందిన యీ పాప త్వరలో మరణిస్తుంది" అన్నారు. అలానే జరిగింది.

మానవుల గురించేకాదు, సర్వ ప్రాణకోటి గురించి ఎప్పుడేమి జరుగుతుందో, ఏమి జరుగనున్నదో బాబాకు తెలుస్తుండేది. ఒకనాడు మశీదులో బల్లి కూస్తుంటే, ఒక భక్తుడు అదేమి శకునమని అడిగాడు. సాయి, "ఇందులో శకునమేమున్నది? ఔరంగాబాదు నుండి తన చెల్లెలు వస్తున్నదని సంతోషిస్తున్నది" అన్నారు. నాటి మధ్యాహ్నం ఒక భక్తుడు గుఱ్ఱంమీద వచ్చి, దానిని మశీదు ముంగిట కట్టేసాడు. దానికి ఉలవలు పెట్టడానికి అతడు సంచీ దులిపితే అందులోంచి ఒక బల్లి బయటపడింది. అదీ, అంతకుముందు కూసిన బల్లీ ఆడుకుంటూ గోడపైకి ప్రాకాయి. బాబా వాటిని చూపగానే భక్తుడు విస్తుబోయి ఆ వ్యక్తిని విచారించాడు! అతడు ఔరంగాబాదు నుండి వస్తున్నానని చెప్పాడు. ఆ ఊరినుండే ఒక మనిషి గుఱ్ఱమెక్కి వస్తాడని, దాన్ని మశీదులోనే కట్టేసి, ఉలవలే పెడతాడని, ఆ సంచిలో ఒక బల్లి వున్నదనీ బాబాకెలా తెలుసు? ఇందులో ఏది జరగకున్నా ఆయన మాట వ్యర్థమవుతుంది. అలానే ఒకనాడు మహల్సాపతితో, "మీ యింటిదగ్గర రెండు పాములున్నాయి. " అన్నారు సాయి. అతడిల్లు చేరేసరికి అతడి యింటి తలుపు దగ్గర ఒక పాము, ప్రక్కనే కుమ్మరివాని తల దగ్గర మరొకటీ కన్పించాయి! మరొకరోజు సాయి తమచేయి పాములా పెట్టి చూపుతూ, "రాత్రి నీవు వచ్చేటప్పుడు ఆ దొంగ ఎదురవుతాడు. కూడా లాంతరు తెచ్చుకో! అన్నారు. అతడా రాత్రి లాంతరు తీసుకొని వస్తుండగా దారిలో ఒక పాము ఎదురైంది.

శ్రీ సాయి ఏమి చేసినా, ఎంత చిన్నమాట చెప్పినా జరుగనున్నదంతా స్పష్టంగా తెలిసి, అలా చేస్తారని భక్తుల అనుభవాలు నిరూపిస్తుండేవి. సదాశివ తార్కాడ్, మిల్లు మేనేజర్ పదవికి రాజీనామాచేసి సకుటుంబంగా శిరిడీలో వున్నాడు. అతడు తిరిగి ప్రయాణమైనప్పుడు సాయి ఆశీర్వదించి, పూనా మీదుగా వెళ్ళమన్నారు. అతని భార్య మన్మాడ్ మీదుగా వెళితే ఖర్చు తగ్గుతుందని ఎంత చెప్పినా, అతడు సాయి చెప్పినట్లే పూనా చేరి ఒక మిత్రుని వద్ద ఆగాడు. అక్కడొక మిల్లు ఆసామి కలిసి అతనికి వెంటనే ఉద్యోగం యిచ్చాడు. శ్రీసాయిని నమ్ముకుంటే చాలు, ఏమీ కోరనక్కరలేదు. ఎప్పుడైనా ఆయన చేసినదే శ్రేయస్కరం, మనకు తోచింది గాదు. ఒక తల్లి తన కొడుకు నార్కేకు స్థిరమైన ఉద్యోగం లేదని బాధపడుతుండేది. ఒకరోజు బాబా ఆమెతో, "నీ బిడ్డను పూనాలో స్థిరపరుస్తాను" అన్నారు. అలానే అతనికి 1917లో పూనాలో స్థిరమైన ఉద్యోగం వచ్చింది. తర్వాత అతనితో ఒక రోజున, "నీ మామ బూటీ యిక్కడొక ఆలయం కడతాడు. నీవు దానికి ధర్మకర్తవవుతావు" అన్నారు బాబా. అలానే బూటీ 1918లో నేటి సమాధి మందిరం కట్టించాడు. తర్వాత దానికి నార్కే ధర్మకర్త అయ్యాడు.

ఒకసారి బాబాకెవరో మామిడి పండ్లు పంపారు. బాబా వాటిని భక్తులకు పంచుతూ, "ఇవి దామ్యాకు" అని 8 పండ్లు వేరుగా వుంచారు. "అతడిక్కడ లేడు కదా!" అంటే ఆయన , "అతడిప్పుడే కోపర్గాం చేరాడు. కొద్ది సేపట్లో వస్తాడు" అన్నారు. అలాగే కొద్దిసేపట్లో దామోదర్ రాస్నే వచ్చాడు. అంతలో ఆ పండ్లలోంచి నాలుగు

పిల్లలెత్తుకుపోయారు. సాయి, "దామ్యా, యీ పండ్లు తిని చావు!" అన్నారు. అతడు భయపడుతుంటే నవ్వి, "వాటిని నీ రెండవ భార్యకివ్వు. మొదట నీకిద్దరు కొడుకులు పుడతారు. మొదటివాడికి "దౌలత్‌షా" అని, రెండవవానికి "తానాషా" అని పేర్లు పెట్టు!" అన్నారు. దామోదర్ రాస్నేకు ఎంతోకాలంగా సంతానం లేదు. సాయి యీ ప్రసాదమిచ్చిన సంవత్సరానికి కొడుకు పుట్టాడు. ఆ బిడ్డను బాబాకు చూపి, వాడికేమి పేరు పెట్టాలని అడిగాడు రాస్నే. " 'దౌలత్‌షా' అని చెప్పానుగదా!" అన్నారు బాబా. దామ్యాకు మొత్తం ఎనిమిది మంది బిడ్డలు పుట్టి, నల్గురు జీవించారు.

ఒకరోజు బాలక్‌రామ్ కుమారుడు శిరిడీ వెళుతున్నానని చెబితే, బాబాకేమైనా పంపాలనుకున్నది శ్రీమతి తార్కాడ్. కాని యింట్లో ఒకసారి నివేదించిన పాలకోవా బిళ్ళతప్ప మరేమీలేదు. అదీగాక బాలక్‌రామ్‌కు మైలవచ్చింది. అయినా బాబాకు భక్తే ప్రధానమని తలచి దానినే పంపింది. అతడు శిరిడీ చేరాక ఆ పాలకోవా సంగతే మరచిపోయాడు. "బాంద్రానుండి నాకేమి తెచ్చావు?" అని బాబా ఎన్నిసార్లడిగినా అతనికి గుర్తు రాలేదు. చివరకు ఆయన, "ఆ తల్లి నాకు మిఠాయి పంపలేదా?" అన్నారు. అతడికి గుర్తొచ్చి వెంటనే పాలకోవా బిళ్ళ తెచ్చి సమర్పించాడు. బాబా దానినెంతో ప్రీతిగా ఆరగించారు. మన హృదయంలో శోకం లేకుంటే మైలసోకినా బాబా పూజ ఆపనక్కరలేదు.

ఒకసారి నానాచందోర్కరు, ఒక కీర్తనకారుడూ శిరిడీనుండి బయల్దేరుతుంటే, బాబా వాళ్ళను భోజనంచేసి వెళ్ళమన్నారు. ఆ కీర్తనకారుడు తొందరపడి భోజనం చేయకుండానే బయల్దేరాడు. నానా మాత్రం బాబా చెప్పినట్లే భోంచేసి బయల్దేరాడు. అతడు స్టేషన్ చేరేవరకు రైలు రానేలేదు. కీర్తనకారుడు ఆకలితో మాడవలసివచ్చింది. ఆరోజు రైలెంత ఆలస్యమయ్యేదీ బాబాకు తెలుసు! అలానే ఉదయం 8 గంటలకు బొంబాయి చేరాలని సంభారే బయల్దేరాడు. బాబా అతనికి ఊదీ యిచ్చి, 'మధ్యాహ్నానికి చేరుతావు పో!' అన్నారు. రైలు 4-30 గంటలు ఆలస్యమై అతడు మధ్యాహ్నానికే చేరాడు. నార్కర్ 1915లో ఒక రోజున సెలవు కోరినప్పుడు బాబా, "రైలందుతుంది, వెళ్ళు" అన్నారు. అతడు కోపర్గాం వద్ద నది ఒడ్డు చేరేసరికి చీకటిపడింది. నది వరదలవలన అప్పుడు పడవ నడపడంలేదు. బాబా మాట వ్యర్థమెలా అయిందా అనుకుంటుండగా ఒక మమల్తదారు అక్కడకొచ్చాడు. అతడికోసం ప్రత్యేకంగా వచ్చిన పడవలో నార్కర్‌గూడ నదిదాటి రైలందుకున్నాడు.

కాకా మహాజని శిరిడీలో ఒక వారముండాలని వచ్చాడు. అతనిని చూస్తూనే బాబా, "నీవింటికి ఎప్పుడు వెళ్తావు?" అన్నారు. "మీరు చెప్పినప్పుడు!" అన్నాడు కాకా. "అయితే రేపే వెళ్ళు!" అన్నారు సాయి. అతడా మర్నాడు బొంబాయి చేరేసరికి, ఆఫీసులో పై అధికారికి జబ్బుచేసి ఆరోజు కాకా తప్పక ఆఫీసుకు పోవలసివున్నది! ధూమల్ అనుభవం యింకొకలా వున్నది. అతడు మరురోజు నీఫాడ్‌లో కోర్టుకు హాజరుకావలసి వున్నది. అతడు దారిలో బాబాను దర్శిస్తే ఆయన అతడిని వారం రోజులు నిలిపేశారు. తర్వాత అతడు నీఫాడ్ చేరేసరికి, జడ్జీకి జబ్బు చేయటం వలన విచారణ ఆ రోజుకు వాయిదా పడిందని తెలిసింది. జోగ్ వద్ద ఒక వ్యక్తి రూ. 1400/-లు అప్పుతీసుకొని, నోటుగడువు దాటిపోతున్నా అప్పు తీర్చలేదు. ఒకరోజు జోగ్ అతనివద్దకని బయల్దేరుతుంటే బాబా నవ్వి, "నీ డబ్బెక్కడికీ పోదు; ప్రశాంతంగా కూర్చో. అదే వస్తుంది" అన్నారు. జోగ్ కోపంతో, 'నేను వెళ్తేనే యివ్వనివాడు దావా వేయకుంటే ఎలా యిస్తాడు? అది రాకుంటే నేనిక్కడ ఎలా బ్రతకాలి, మీ సేవెలా చేయాలి?'అన్నాడు. బాబా సెలవియ్యక పోయేసరికి అతడు ఆశ వదులుకున్నాడు. నోటు గడువు తీరిపోయింది. కానీ తర్వాత ఆ వ్యక్తి వచ్చి రూ. 1400/-లు యివ్వబోయాడు. కాని జోగ్ వడ్డీ గూడ యిస్తేనేగాని ఆ పైకం ముట్టనని పట్టుబట్టాడు. కాని,వడ్డీ లేకుండానే తీసుకోమని సాయి చెప్పినందువల్ల అతడా పైకం తీసుకొని ఆయనకే అర్పించాడు. సాయి కొద్ది మాత్రమే తీసుకొని మిగిలినది అతనికే యిచ్చారు. వేరు గతిలేకుంటే తప్ప వడ్డీ తీసుకోవడం మహా పాపమని,

ఆచరించిన ధర్మమంతా వ్యర్థమైపోతుందనీ ఋషులు చెప్పారు.

మన మనఃప్రవృత్తిని బట్టే బాబా లీలలు అనుభవమవుతాయి. బాబాపై ఎట్టి విశ్వాసం లేకుండా ఆయనను పరీక్షచేయడానికి వచ్చిన హరికనోబా, తన క్రొత్త చెప్పులు మశీదుముందు విడచి, అవి కన్పించేలా లోపల కూర్చున్నాడు. దురభిమానంతో అతడు సాయిచెంతన కూడ తన తలపైనున్న జరీ తలపాగాను తీయలేదు. అతడు బయటకు వచ్చేసరికి చెప్పులు లేవు! అతడు భోజనముచేసి విచారంగా బసకు చేరాక, ఒక పిల్లవాడు ఆ చెప్పుల జత తన కర్రకు తగిలించుకొని, "హరికా బేటా, జరీకా ఫేటా" -- 'హరి అనేవాడి కొడుకు, జరీ తలపాగ కలవాడు ఎవరు?' అని కేకలు వేస్తున్నాడు. అతణ్ణి పిలచి విచారించగా, సాయి అతనికా చెప్పులిచ్చి, ఆ విధంగా విచారించి వాటిని ఆసామికివ్వమని చెప్పారని తెలిసింది. సాయికి తన పుట్టుపూర్వోత్తరాలు కూడ తెలుసని కనోబా గుర్తించాడు.

అంతటి మహనీయుని ఎప్పుడూ గుర్తుంచుకోడానికి ఆయన పటం దగ్గర వుంచుకోవడం సమంజసమే, కాని అది మాత్రమే చాలదు. ఒకరోజు కొందరు యువకులు బాబాను ఫోటో తీసుకుంటామని శ్యామాను అడిగారు. బాబా లెండీనుండి వచ్చేటప్పుడు సాఠేవాడ వద్ద నిలుపుతానని, అప్పుడు ఫోటో తీసుకోమనీ వాళ్ళతో శ్యామా చాటుగా చెప్పాడు. తర్వాత లెండీనుండీ తిరిగివస్తూ బాబా, "శ్యామా! ఏమిటీ గోల? ఫోటో తీయవద్దని పిల్లలకు చెప్పు! అడ్డుగోడ కూలదోస్తే అదే చాలు!" అని గబగబ వెళ్ళిపోయారు. ఆ యువకులు ఏ మధ్యవర్తినీ ఆశ్రయించక బాబానే ఆశ్రయిస్తే పని జరిగేదేమో! రాగద్వేషాలు విడిచి, అందరిలోనూ బాబా వున్నారని గుర్తుంచుకొనడమే అడ్డుగోడలు తొలగించుకోవడమంటే. మరొక రోజున తమను దర్శించవచ్చిన ఒక భక్తుణ్ణి అడిగి మరీ ఫోటో తీయించుకున్నారు బాబా. అందరూ ఆశ్చర్యపోతుంటే అతడిలా చెప్పాడు: "నేను శిరిడీ వస్తుంటే ఎలాగైనా సాయిని ఫోటో తీయ ´ని నా మిత్రుడు జోషీ కెమేరా యిచ్చాడు."

